


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
జూన్ 23, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


## లఖ్‌నవూలో అగ్నివిషాదం.. కోచింగ్ సెంటర్‌లో 15 మంది మృతి




- మూడంతస్తుల భవనంలో భారీగా మంటలు
- విద్యార్థులతో పాటు పలువురు బలికావడం విషాదం
- ప్రాణాల కోసంపై అంతస్తుల నుంచి దూకిన బాధితులు
- గాయపడిన వారికి ఆసుపత్రుల్లో చికిత్స కొనసాగింపు
- ఆలస్యంగా చేరిన అగ్నిమాపక సిబ్బందిపై ఆరోపణలు
- మృతుల కుటుంబాలకు కేంద్రం పరిహారం ప్రకటన
- ఘటనపై సమగ్ర దర్యాప్తునకు యూపీ ప్రభుత్వం ఆదేశం

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో సోమవారం సంభవించిన ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 15కు చేరుకుంది. మరికొందరు తీవ్ర గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో విద్యార్థులతో పాటు మరికొందరు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. ఇంకా కొంతమంది పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలీగంజ్ ప్రాంతంలోని మూడంతస్తుల భవనం పైభాగంలో తొలుత మంటలు చెలరేగాయి. అనంతరం అవి వేగంగా వ్యాపించి పై అంతస్తులో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌ను చుట్టుముట్టాయి. కొద్ది నిమిషాల్లోనే భవనమంతా మంటలు, దట్టమైన పొగతో నిండిపోవడంతో లోపల ఉన్న వారు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. బయటకు వచ్చే మార్గాలు లేకపోవడంతో అనేక మంది ప్రాణాల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంటల్లో చిక్కుకున్న కొందరు విద్యార్థులు, సిబ్బంది తమ ప్రాణాలను రక్షించుకోవడానికి పై అంతస్తుల నుంచి కిందికి దూకారు. మరికొందరు కిటికీల వద్దకు చేరుకుని సహాయం కోసం వేడుకున్నారు. ఒక వ్యక్తి పగిలిన కిటికీ ద్వారా బయటకు రావడానికి ప్రయత్నించే సమయంలో కింద పడిపోగా, అక్కడ ఉన్న స్థానికులు వెంటనే స్పందించి అతడిని రక్షించారు. గాయపడిన అతడిని అత్యవసరంగా ఆసుపత్రికి తరలించారు. కొందరు విద్యుత్ తీగలను పట్టుకుని బయటపడేందుకు ప్రయత్నించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ప్రమాద సమాచారం అందిన తర్వాత అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. అయితే అగ్నిప్రమాదం జరిగిన దాదాపు అరగంట తర్వాతే ఫైర్ ఇంజిన్లు సంఘటనా స్థలానికి చేరుకున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆలస్యమే మంటలు మరింత విస్తరించడానికి కారణమైందని వారు చెబుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టి పలువురిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ విషాద ఘటనపై దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి

(మిగతా 2వ పేజీలో)



## మెట్రో విస్తరణకు కేంద్ర సహకారం కోరిన సీఎం

**ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కీలక భేటీ**

- హైదరాబాద్ మెట్రో రెండో దశపై విస్తృతంగా చర్చలు
- ఐఆర్‌ఎఫ్‌సీ రుణం విడుదలకు చొరవ చూపాలని విజ్ఞప్తి
- సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- పట్టణాభివృద్ధి శాఖతో సమన్వయానికి కేంద్రం హామీ
- ఖట్టర్‌తో నేడు కీలక సమావేశానికి రంగం సిద్ధం
- చర్చలు సానుకూలంగా జరిగాయని వెల్లడించిన సీఎం

న్యూఢిల్లీ: హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర రాజధానిలో పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ సమస్యలు, నగర విస్తరణ నేపథ్యంలో మెట్రో రెండో దశను త్వరితగతిన అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఢిల్లీలోని రైల్‌భవన్‌లో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు రెండున్నర గంటలకు పైగా కొనసాగిన ఈ భేటీలో తెలంగాణకు సంబంధించిన పలు కీలక అంశాలతో పాటు హైదరాబాద్ మెట్రో విస్తరణ ప్రధాన చర్చాంశంగా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో రెండో దశ ప్రాజెక్టు అమలుకు అవసరమైన ప్రక్రియలను పూర్తి చేసిందని సీఎం వివరించారు. నగర అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును వేగవంతం చేయడం అత్యవసరమని కేంద్ర మంత్రి

(మిగతా 2వ పేజీలో)

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

- ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి
- తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్
- జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు



హైదరాబాద్ : తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.



## నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు.. వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా: కేటీఆర్

- ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కేటీఆర్
- మా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ
- సప్తసముద్రాలు దాటినా వెతికి పట్టుకొస్తానని శపథం
- వచ్చే ఐదేళ్లు చిట్టి నాయుడుకి, ఆయన బృందానికి సినిమా చూపిస్తానన్న కేటీఆర్
- వర్ధన్నపేట కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను తన తండ్రి కేసీఆర్ అంత మంచివాడిని కాదని, తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టే

(మిగతా 2వ పేజీలో)

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

- ఉద్యోగులు, విద్యార్థులు ముందుగానే ఇళ్లకు వెళ్లాలని పోలీసుల సూచన
- సాయంత్రం 3:30 నుంచే కార్యాలయాలు మూసివేయాలని విజ్ఞప్తి
- గత అనుభవాల దృష్ట్యా ట్రాఫిక్ సమస్యల నివారణకు ముందస్తు చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా జూన్ 27 వరకు వర్షాలు కురిసే అవకాశం



హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, నీటి నిల్వ సమస్యలను నివారించేందుకు గాను కీలక సూచనలు

(మిగతా 2వ పేజీలో)

## మల్కాజిగిరి జోనల్ కార్యాలయం లో ప్రజావాణికి 39 ఫిర్యాదులు సమస్యలను తక్షణమే పరిష్కరించాలి జోనల్ కమీషనర్



వార్త మిర్రర్,మల్కాజిగిరి:
మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జోన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. మౌలాలి సర్కిల్ మోడల్ సుధా నగర్ కాలనీలో చిన్నపాటి వర్షానికి నాలా పొంగి మురుగునీరు ఇండ్లలో కి వస్తుంది, గతంలో ఎన్నో సార్లు ఇంజనీరింగ్, హైడ్రాధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన లేదని జోనల్ కమిషనర్ కు వివరించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరారు.మొత్తం 39 ఫిర్యాదులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.బాధితుల నుంచి అర్జీలను స్వీకరించిన జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును కూలంకషంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసమే ఆశతో ఇక్కడికి వస్తారని, కాబట్టి ఏ ఒక్క అప్లికేషన్‌ను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## దేవరకొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మారుపాక సురేష్ గౌడ్ నియామకం



దేవరకొండ జూన్ 22 వార్త మిర్రర్::::::
దేవరకొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మారుపాక సురేష్ గౌడ్ నియమితుల య్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ ) అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు.దేవరకొండ మండలం తాటికల్ గ్రామపం చాయతీకి చెందిన మారుపాక సురేష్ గౌడ్ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడు. ఆయన గత ఏడు సంవత్సరాలు గా మండల పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. సురేష్ గౌడ్ రాజకీయ నేపథ్యం కుటుంబ పరంగా కూడా ఎంతో విశిష్టమైనది. ఆయన తండ్రి నారయ్య గౌడ్ తాటికల్ గ్రామపంచాయతీకి వరుసగా మూడుసార్లు సర్పంచ్‌గా ఎన్నికై ప్రజలకు విశేష సేవలు అందించారు. అలాగే, సురేష్ గౌడ్ సతీమణి అరుణ, 2019 నుండి జెడ్పిటిసి సభ్యురాలిగా ప్రజాక్షేత్రంలో సేవలందిస్తున్నారు.తన నియామకం పట్ల మారుపాక సురేష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ బాధ్యతను కల్పించిన అధిష్టానానికి, తనపై నమ్మకం ఉంచిన దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానంలో మార్గదర్శకులుగా నిలిచిన సీనియర్ నాయకులు జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సిరాజ్ ఖాన్, హనుమంతు వెంకటేష్ గౌడ్ మరియు తనను ప్రోత్సహించిన పార్టీ శ్రేణులందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.మండల స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, ప్రజల సమస్యలపై పోరాడేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని నూతన అధ్యక్షుడు సురేష్ గౌడ్ హామీ ఇచ్చారు.

## చందంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దొండేటి మల్లారెడ్డి నియామకం.



చందంపేట జూన్ 22 వార్త మిర్రర్:::::::
చందంపేట మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా దొండేటి మల్లారెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఈ మేరకు నియామక ఉత్తర్వులను పార్టీ శ్రేణులు వెల్లడించాయి.దొండేటి మల్లారెడ్డికి రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన 2006లో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తూ, 2019 మరియు 2024లో వరుసగా కోరుట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై, నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నారు.కృతజ్ఞతలు తెలిపిన నూతన అధ్యక్షుడు:మండల అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినందుకు దొండేటి మల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “తన నియామకానికి సహకరించిన గౌరవ ఎమ్మెల్యే బాలు నాయక్ కు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, మరియు తనను నమ్మి అండగా నిలుస్తున్న మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను” అని అన్నారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని మల్లారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలోనూ పార్టీని పటిష్టం చేస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు.

## రాయికల్ డీప్యూటి తహసిల్దార్ గా అరుణ్ కుమార్



**వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 22జగిత్యాల జిల్లా రాయికల్ మండల డీప్యూటి తహసిల్దార్ గా అరుణ్ కుమార్ సోమవారం రోజున బాధ్యతలు స్వీకారంచారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు అభినందనలు తెలిపారు.**



## తార్నాక సర్కిల్ అభివృద్ధి, వర్షాకాల సన్నద్ధతపై మాజీ డిప్యూటీ మేయర్‌తో డిప్యూటీ కమిషనర్ భేటీ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 22 : జీహెచ్ఎంసీ తార్నాక సర్కిల్‌కు నూతనంగా నియమితులైన డిప్యూటీ కమిషనర్ సుధీర్ సింగ్ ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల కమిటీ సభ్యుడు మోతే శోభన్ రెడ్డిలను తార్నాకలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తార్నాక సర్కిల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న జీహెచ్ఎంసీ ఆమోదిత పనుల పురోగతిపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తార్నాక డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, డ్రైనేజీ వ్యవస్థల మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సర్వే నిర్వహణపై కూడా చర్చించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా సర్వే చేపట్టేందుకు అవసరమైన చర్యలపై అభిప్రాయాలు పంచుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాల పనితీరు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలు, నీటి నిల్వలు, డ్రైనేజీ సమస్యలు, చెట్ల కూల్చివేతలు, ట్రాఫిక్ అంతరాయాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై డిప్యూటీ కమిషనర్ వివరించారు. ఈ సందర్భంగా మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ తార్నాక సర్కిల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి పనులు మరింత వేగవంతమవుతాయని మోతే శోభన్ రెడ్డి పేర్కొన్నారు.

# బొడ్డు వారి పాలెం లో ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం

**- బండారు వారి ఆధ్వర్యంలో ఘనంగా వసంతోత్సవం.. ఏకాంత సేవ కార్యక్రమం.!**

**- అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న బండారు బ్రదర్స్- మనుదీప్- సందీప్ కుటుంబ సభ్యులు**





వార్త మిర్రర్ నెల్లూరు ప్రతినిధి నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం బొడ్డువారిపాలెం గ్రామంలోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని భారతీయ సంస్కృతి లో అత్యంత పవిత్రమైన వైభవంగా, ఆధ్యాత్మిక వేడుకగా, భక్తి పరిపూర్ణ ప్రేమకు ప్రతికగా ఈ దివ్య కళ్యాణాన్ని వేద పండితులు మంత్రోత్సవాలతో కనుల పండుగగా గ్రామస్తులు, బండారి వారు ఘనంగా నిర్వహించారు. బండారు వారి కుటుంబ సభ్యులు బండారు మల్లికార్జున- అనురాధ వారి కుమారులు భ్రమరాంబిక ప్రాపర్టీస్ అధినేత బండారు మనుదీప్- సాయి సంతోషి, ప్రముఖ విద్యావేత్త బండారు సందీప్- సాయి మౌనిక వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వసంతోత్సవం, ఏకాంత సేవ కార్యక్రమాలను బండారు వారు ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో బండారు వారి కుటుంబ సభ్యులు పాల్గొని భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి అనేక గ్రామాల నుంచి రామ భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని తిలకించి అనంతరం కళ్యాణ మహోత్సవ తీర్థ ప్రసాదాలను స్వీకరించి, కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు



# ఎస్ఐఆర్ అనేది ఎన్నికల సంఘం ముఖ్య విధి..

**కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అసత్య ప్రచారం మానుకోవాలి..**

**బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్.**



వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జూన్ 22
రాజ్యాంగం ప్రకారం ఎస్ఐఆర్ అనేది ఎన్నికల సంఘం విధినిర్వహణలో ముఖ్య భాగమని ప్రత్యేక సమగ్ర సవరణ అనే ప్రక్రియ ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టు లాంటిదని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ అన్నారు. ఇంతటి పవిత్ర కార్యక్రమాన్ని కుటుంబ పార్టీలు అయినటువంటి కాంగ్రెస్,ఎంఐఎం, బిఆర్ఎస్ పార్టీలు బిజెపి పార్టీ ఎన్నికల సంఘం కలిసి ముస్లింల, క్రైస్తవుల, ఎస్సీ, ఎస్టీ, మహిళల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టించడానికి ఎన్నికల్లో గెలుపు మార్గాల కోసం విష ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఒకవేళ అదే నిజమైతే ఒక్క కేసు ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఎందుకు నమోదు కాలేదని నమోదైన ఎందుకు కోర్టు ముందు నిలువలేకపోయిందని ప్రశ్నించారు. ఇన్ని రోజులు దొంగ ఓట్లతో బోగస్ ఓట్లతో గెలవడానికి ఉచితాల పేరిట అడ్డగోలుగా హామీలు ఇచ్చి బంగ్లాదేశ్, పాకిస్తాన్, మయన్మార్ లాంటి దేశాల నుండి వచ్చిన అక్రమ చొరబాటుదారులకు ఆశ్రయం కల్పించి ఓటు బ్యాంకుగా మలుచుకున్నాయని అన్నారు. అక్రమ చొరబాటుదారులు, చనిపోయిన, చిరునామా మారిన వారి ఓట్లు, డబుల్ త్రిబుల్ ఓట్ల తొలగింపు కార్యక్రమం ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధంగా నిర్వహిస్తుంటే బిజెపి మద్దతుతోనే ఎన్నికల సంఘం ఓట్ల తొలగింపు కార్యక్రమం చేపట్టిందని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గత 12 సంవత్సరాల నుండి బిజెపి ప్రభుత్వం కేంద్రంలో ఉండగా అక్రమ చొరబాటుదారులు ఎలా వచ్చారని ప్రశ్నించడం సిగ్గుచేటని అన్నారు. అక్రమ చొరబాటుదారులు వచ్చింది 12 ఏళ్ల కాలం నుండి కాదని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాలలో కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుండి వచ్చిన అక్రమ చొరబాటుదారులకు ఎర్ర తివాచి పరచి స్వాగతం పలకడం వల్లనే ఇలాంటి పరిస్థితి దాపురించిందని అన్నారు. సర్ అనేది భారత ఎన్నికల వ్యవస్థలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగమని ఇది కొత్తగా నరేంద్రమోడీ ప్రధాని అయ్యాక తీసుకొచ్చిన విధానం కాదని స్పష్టం చేశారు. భారత ఎన్నికల సంఘం ఇప్పటివరకు 11 సార్లు సర్ ప్రక్రియను నిర్వహించిందని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కూడా ఎన్నికల సంఘం అనేకసార్లు సర్ నిర్వహించిందని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారిని ఉరితీయాలని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించడం రాజ్యాంగ ప్రతిపత్తి గల ఎన్నికల సంఘాన్ని అవమానించడమేనని అన్నారు. 135 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి నామినేషన్ పత్రం పూర్తి చేయరాకపోవడం దురదృష్టకరమని అన్నారు. నరేంద్ర మోడీ ప్రధాని అయ్యాక సరిహద్దుల్లో భారత భూభాగం లోనికి చైనా చొచ్చుకు వచ్చిందని తప్పుడు ప్రచారం చేసి దేశ సార్వభౌమత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ ని ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు పల్లె మోహన్ రెడ్డి, మండల నాయకులు కాశెట్టి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# నారాయణ కళాశాలలో డ్రగ్స్ దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం

**‘సే నో టు డ్రగ్స్’ ప్రచారంలో భాగంగా విద్యార్థులకు సూచనలు**



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 22:
ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణ కళాశాలలో “డ్రగ్స్ దుర్వినియోగం మరియు డ్రగ్స్ అక్రమ రవాణా” అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చేపడుతున్న “సే నో టు డ్రగ్స్” ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై పోలీసులు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం. మహేష్ మాట్లాడుతూ, డ్రగ్స్ తాత్కాలిక ఆనందాన్ని కలిగించినప్పటికీ వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తాయని తెలిపారు. స్నేహితుల ఒత్తిడి లేదా ఆసక్తి కారణంగా ఎట్టి పరిస్థితుల్లోనూ మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదని సూచించారు.డ్రగ్స్ వినియోగం వల్ల మెదడు, గుండె, కాలేయం వంటి కీలక అవయవాలు దెబ్బతినడంతో పాటు చదువుపై ఏకాగ్రత తగ్గి భవిష్యత్తు అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరించారు. మాదకద్రవ్యాల వ్యసనం మానసిక ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలకు దారితీస్తుందని, నేరాలకు కారణమయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. డ్రగ్స్ కలిగి ఉండటం, వినియోగించడం లేదా విక్రయించడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని విద్యార్థులకు తెలియజేశారు. హైదరాబాద్ సిటీ పోలీస్ ప్రత్యేకంగా రూపొందించిన అవగాహన పోస్టర్‌లోని సందేశాలను విద్యార్థులకు వివరిస్తూ, “స్టే అవే ఫ్రమ్ డ్రగ్స్ -- ప్రొటెక్ట్ యువర్ ఫ్యూచర్”, “డ్రగ్స్ డిస్ట్రాయ్ లైవ్స్, డ్రీమ్స్ అండ్ ఫ్యామిలీస్”, “చూస్ హెల్త్, చూస్ హోప్, చూస్ లైఫ్”, “బి స్మార్ట్... డోంట్ స్టార్ట్”, “సే నో టు డ్రగ్స్ -- సే యెస్ టు లైఫ్” వంటి నినాదాలను గుర్తుంచుకోవాలని సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చిన పోలీసులు, మాదకద్రవ్యాల దుర్వినియోగం లేదా అక్రమ రవాణా గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1908, డయల్-100, నార్కోటిక్స్ హెల్ప్‌లైన్ 87126 97708, వాట్సాప్ నంబర్ 94906 66111లను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ జయచందర్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మొండికుంట కాలువ అక్రమాలపై జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం..

**బిజెపి కౌన్సిలర్ బుడ్డ సురేష్..**



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 22
చౌటుప్పల్ - నాగారం ( వలిగొండ) రోడ్ లో సర్వే నంబర్ 175 ‌ 176 లోని మొండికుంట కాలువ స్థలం లో జరుగుతున్న అక్రమ కట్టడాల పై బిజెపి కౌన్సిలర్ బుడ్డ సురేష్,ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.కౌన్సిలర్ బుడ్డ సురేష్ మాట్లాడుతూ గత లో 2020 సంవత్సరంలో మొండికుంట కాలువ స్థలం ఆక్రమణ గురించి అప్పటి కమిషనర్ రామ్ దుర్గా రెడ్డి, జిల్లా కలెక్టర్ కు విన్నపించగా వారు 100 మీటర్ ల పొడవుతో కల్వర్టు నిర్మాణం 100 ఫీట్ ల వెడల్పు తో మొండికుంట కాలువ నిర్మాణం జరుగుతుంది అని చెప్పి మొండికుంట కాలువ స్థలం ను ఆక్రమించి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయడం జరిగింది. కానీ అదే చోట ఇప్పుడు మళ్లీ కనీసం 20 మీటర్ ల పొడవు కూడా లేకుండా కల్వర్టు ను నిర్మాణం పనులు చేయడం జరుగుతుంది. చౌటుప్పల్ పట్టణ 80% కు పైగా మురుగునీరు వర్షపు నీరు వలిగొండ రోడ్ లోని మొండికుంట కాలువ గుండా ప్రవహిస్తుంది. భవిష్యత్తు లో అవసరాలకు అనుగుణంగా 100 మీటర్ల పొడవుతో కల్వర్టు పూర్వపు యధాస్థితి ఉండేలా నిర్మాణం చేపట్టాలని కోరడం జరిగింది.

175,176 సర్వే నెంబర్ల భూమిలో పరిమితి ని మించి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ లను రద్దు చేసి అక్కడ జరిగిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలి.సర్వే నిర్వహించి సరిహద్దుల ను గుర్తించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆలే చిరంజీవి, మున్సిపాలిటీ ఉప్పధ్యక్షులు వంగాల రమాకాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# వెస్లీ స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసిన పరమేశ్వర్ రెడ్డి

నాచారం, జూన్ 22 వార్త మిర్రర్ :

అన్నపూర్ణ కాలనీలోని వెస్లీ కో-ఎడ్యుకేషన్ హై స్కూల్ ప్రాంగణంలో టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షులు వి.ఎస్. ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి పాల్గొని 6వ, 7వ, 8వ, 9వ మరియు 10వ తరగతి విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజ సేవలో ముందుండి ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న వి.ఎస్. ప్రకాష్ రెడ్డిని అభినందిస్తూ భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఆర్. మోహన్, జి. కృష్ణా రెడ్డి, బి. శ్రీకాంత్ గౌడ్, రామ్ రెడ్డి, రమేష్ గౌడ్, అశ్వత్థామ రెడ్డి, మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, సుధాకర్ రెడ్డి, నూతనకంటి రాజు, బాలరాజు, కాప్రా సాయి, నరసింగ్ రావు, సునీల్ రెడ్డి, రఘు, కృపాకర్, అజీమ్, కోటేష్, కోత వెంకటేష్ గౌడ్, ఖయ్యూం, ఫహీమ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, యూసుఫ్, షాహిక్, రేవంత్, జాఫర్ మహిళా నాయకులు ఉమా, భావనా గౌడ్, భారతమ్మ,



ఛాదు పాల్గొన్నారు. ఎంఈఓ రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సప్తమి పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ..

### స్వామి వారికి పంచామృత అభిషేకం, ముడుపు సమర్పణ
### ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జూన్ 21

ఆదివారం భానువాసరే జ్యేష్ఠ మాసం శుక్ల పక్షం సప్తమి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి ఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకం సూర్య భగవానుని విశిష్టత : ఆదివారం -- సూర్య భగవానుని ప్రత్యేక దినంఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. .ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియ పర్వదినం పురస్కరించుకొని జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. తదనంతరం అమ్మత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేయడం జరిగినది. తదనంతరం సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్



హొద్నాల శ్రీనివాస్, సహాయ కోశాధికారి గోపి, సహ కార్యదర్శి భారతాల రాజసాగర్, పెద్ది శ్రీనివాస్, వేముల రాజేష్, యాంసాని శంకరయ్య, చెన్నూరి శ్రీధర్, ఎలిమేళ్ల సత్యనారాయణ, తాటిపల్లి ప్రవీన్ కుమార్, హరీష్, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళాబృందం ద్వారా అవగాహన

వార్త మిర్రర్ రాయికల్ జూన్ 22 ప్రపంచమాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులు విద్యార్థినులకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధీర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వడంతో పాటు 1908 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్యాభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కళాబృందం సభ్యులు పాటలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, గంగాజమున,



నాగరాజు, పద్మజ, తిరుమల, వనిత, శ్రీకాంత్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలీస్ కళాబృందం సభ్యులు కమల్, ఇస్లావత్, గడ్డం రమేష్, హనుమంత్, సతీష్, సత్తయ్య, లక్ష్మణ్, కాంతయ్య పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మురికి కాలువల పరిష్కారం చూపిన ఎంపీడీవో

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 22

జగిత్యాల జిల్లాలో రాయికల్ మండలశీ మైతాపూర్ లోని మూడవ వార్డు లో గత కొన్ని సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 3వ వార్డు ప్రజలకు సోమవారం రోజు రాయికల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గ్రామానికి వచ్చి వార్డు లో ఉన్నటువంటి మురికి కాలువలు పరిశీలించి పరిష్కారానికి మార్గం చూపారు. కొద్దిపాటి వర్షం కురిసిన కానీ అక్కడ ఉన్నటువంటి ఇండ్ల లోనికి, పెంట కుప్పలు, ఇతర ఖాళీ స్థలంలో వర్షం నీరు నిండి ఇండ్ల లోనికి చేరడంతో ప్రజలు రోగాల బారిన పడి నానా అవస్థలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఆరోగ్యం ఎలాంటి రోగాల పాలు కాకుండా అందరూ బాగుండలని కోరుకుంటు 3వ వార్డు లో గత పాలకులు మురికి కాలువలు నిర్మించి పూర్తిగా రోడ్డు కు అనుకోని ఉన్నటువంటి మురికి కాలువలో కలువకుండా వదిలేసి ఉన్నటువంటి మురికి కాలువ ఈ రోజు పరిష్కారానికి మార్గం సుగమం చేశారు. వారికి గ్రామంలో ఉన్న ప్రజలు, మూడవ వార్డు సభ్యురాలు అనుమల్ల రమ, ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ తలారి నాగమణి రాజేష్, ఉపసర్పంచ్ దొంగ ప్రణయ్, మాజీ జడ్పిటిసి గోపి మాధవి రాజారెడ్డి, వార్డు సభ్యులు, యాదవ సంఘం అధ్యక్షులు బుస గంగా మల్లయ్య, అనుమల్ల రమ, బతిని శ్రీనివాస్, తోగిటి నవీన్, బూపెల్లి పరమేష్, కొల్ల ప్రమీల నారాయణ, నాయకులు డాక్టర్ పాలడుగు లింగారెడ్డి. మిట్ట పెల్లి ప్రభాకర్, మ్యాకల రాజేషం, కొల్లవేణుగోపాల్, అనుమల్ల సత్యనారాయణ, రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బంధారపు మహేష్, పంచాయతీ వర్క్ ఇన్స్పెక్టర్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు ఇళ్లు -- రాజకీయాలకు కాదు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

### ---డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పంపిణీ పారదర్శంగా నిర్వహించాలి
### --.ప్రజల అవసరాలే ప్రాధాన్యం... రాజకీయాలు కాదు

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి

జూన్22 :- తెలంగాణ రాష్ట్రంలో కే. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలనే లక్ష్యంతో డబుల్ బెడ్‌రూమ్ గృహ పథకం అమలు చేయబడిందని పేర్కొన్నారు. సోమవారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పంపిణీ పారదర్శంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రాన్ని అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎలక్ట్రానిక్ మీడియాతో మాట్లాడుతున్నారు ఎన్నికల ముందు వరకు లక్షల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి, అర్హులైన పేదలకు పంపిణీ చేసినట్లు తెలిపారు.ఆ సమయంలో పార్టీలు, కులాలు, మతాలు అనే భేదం లేకుండా అర్హత ఆధారంగా దరఖాస్తులను పరిశీలించి ఇళ్లు కేటాయించామని, "ఇల్లు లేని పేదవాడికి పార్టీతో సంబంధం ఉండకూడదు" అనే భావనతో ముందుకు వెళ్లామని చెప్పారు.ఇంకా కొన్ని ప్రాంతాల్లో నిర్మాణ పనులు చివరి దశలో నిలిచిపోయాయని, కొన్నిచోట్ల ఫ్లోరింగ్, డోర్లు, ఇతర మౌలిక పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేసి అర్హులకు అందించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఆశించిన స్థాయిలో స్పందన లేదన్నారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ విషయంలో రాజకీయ పక్షపాతం లేకుండా గతంలో వచ్చిన దరఖాస్తులను మళ్లీ పరిశీలించి అర్హులందరికీ పారదర్శకంగా కేటాయించాలని కోరారు. కేవలం ఒక పార్టీకి చెందిన వారికి మాత్రమే ప్రయోజనం చేకూరే విధంగా



నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు.అలాగే నియోజకవర్గ అభివృద్ధి నిధులు, పెండింగ్ పనులు, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రజా అవసరాల పనులను రాజకీయ కోణంలో నిలిపివేయకుండా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల అవసరాలే ప్రాధాన్యం... రాజకీయాలు కాదు అని ఆమె పేర్కొన్నారు.



# శ్రీ శ్రీ శీతాల బొడ్రాయి విగ్రహ పునర్ ప్రతిష్టా కార్యక్రమానికి బీజేపీ నాయకులకు ఆహ్వానం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి

జూన్22 :- మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి పరిధిలోని బాలాపూర్ గ్రామంలో శ్రీ శ్రీ శీతాల బొడ్రాయి (నాభిశిల) విగ్రహ పునర్ ప్రతిష్టా కార్యక్రమం బాలాపూర్ గ్రామంలో 25 జూన్ నుంచి 28 జూన్ వరకు నిర్వహించబడుతున్నది ఈ యొక్క కార్యక్రమానికి 27 వ తేదీ ఉదయం 10 గం నుండి మధ్యాహ్నం 2 గం ల సమయం లో హాజరై అమ్మవారి దీవెనలు పొందవలసిందిగా కోరుతూ సోమవారం బిజెపి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు, భారత ప్రభుత్వ విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ని మరియు పార్లమెంట్ సభ్యులు మహబూబ్ నగర్, తెలంగాణ ఎఫ్సిఐ చైర్మన్ డీకే అరుణ ని కలిసిన బిజెపి రాష్ట్ర కోపరేటివ్ సెల్ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డివారి టీమ్ తో కలసి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు దొడ్డి శ్రీశైలం, బిజెపి రంగారెడ్డి జిల్లా ఎస్సి మోర్చా సెక్రెటరీ గుండె నాగార్జున సీనియర్ నాయకులు సాంబ రవి, మునగాల ప్రభాకర్ రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు గంగారం సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# శ్రీ శ్రీనివాస కాలనీకి కృష్ణ వాటర్ అందించండి అధికారికి కాలనీ కమిటీ వినతి

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధిహయత్ నగర్ డిపో రోడ్డు శ్రీ శ్రీనివాస కాలనీలో కృష్ణ వాటర్ రావడం లేదని హైదరాబాద్ మెట్రో పాలిటన్ వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డు అధికారులకు శ్రీ శ్రీనివాస కాలనీ కమిటీ నాయకులు వినతి పత్రాన్ని అందించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాస కాలనీకి కృష్ణ వాటర్ రాక కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇట్టి విషయాన్ని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగి వినతులు అందించామని అయినా కృష్ణ వాటర్ రావడం లేదని తెలిపారు. మీరు తక్షణమే స్పందించి పై అధికారులతో మాట్లాడి మా కాలనీకి కృష్ణ వాటర్ అందేలా చూడాలని తెలిపారు ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస కాలనీ కమిటీ అధ్యక్షులు పైళ్ల సుదర్శన్ రెడ్డి, కాలనీ కమిటీ నాయకులు కృష్ణ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి ,బి శ్రీనివాస్, ధర్మారెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సిరెడ్డి, నరసింహ, లింగం యాదవ్, సత్యనారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు



# హైదరాబాద్ 2 డిపో నూతన మేనేజర్ నరసింహ కు ఎంప్లాయిస్ యూనియన్ ఘన సన్మానం

వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరోహైదరాబాద్ 2 డిపోకు నూతన మేనేజర్ గా బాధ్యతలు చేపట్టిన నరసింహకు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు, పువ్వుల బొకే అందించి శాలువాతో సత్కరించి డిపోకు ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ డిపో ప్రెసిడెంట్ సురపల్లి సత్యనారాయణ, డిపో సెక్రటరీ యాదగిరి, గ్యారేజీ సెక్రెటరీ సాయినాథ్ సీనియర్ నాయకులు పాశం యాదగిరి, ఎల్లం గౌడ్, నాగరాజు, రమేష్, శేఖర్, నరసింహ టి. రమేష్ ,సాయికృష్ణ, పి శేఖర్, బి రమేష్, జాకీర్, హుస్సేన్, అల్లం శంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు




# బొడ్రాయి మహోత్సవానికి గడ్డం ప్రసాద్ ని ఆహ్వానించిన చిగిరింత నరసింహారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి

జూన్22 :-మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధిలోని బాలాపూర్ లో ఈ నెల 25వ తేదీ నుంచి జరగనున్న బొడ్రాయి మహోత్సవ పండుగ కు సంబంధించిన ఆహ్వానాన్ని తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కి అందజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి మరియు నాయకులు సింగిరెడ్డి పెంటారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎర్ర జైహింద్, బాలింగని జంగయ్య, గిరికటి కృష్ణంరాజు గౌడ్, టేకుల శశిధర్ రెడ్డి, నిరుడు శ్రీరాములు, పగడాల ఉమేష్, బోనగిరి శ్రీనివాస్, సంరెడ్డి మహిపాల్ రెడ్డి తదితరులు.పాల్గొన్నారు



# గేమ్‌ఛేంజర్ వచ్చేది అప్పుడే?



రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' విషయంలో కొత్త అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా? అని ఆశగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది నిజంగా చల్లని వార్తే. వచ్చే ఏడాది సమ్మర్‌లోపు ఈ చిత్రం షూటింగ్‌ను ముగించనున్నట్టు సమాచారం. దాదాపు 90శాతం ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. ఇదిలావుంటే.. శంకర్ దర్శకత్వంలోనే కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' కూడా పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. దీన్నిబట్టి ఒక రెండునెలలు అటుఇటుగా రెండు సినిమాలూ విడుదలయ్యే అవకాశం ఉందని సినీవర్గాల సమాచారం. ఇక రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' సినిమా విషయానికొస్తే, సమకాలీన రాజకీయాలను ప్రశ్నిస్తూ, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ శంకర్ తెరకెక్కిస్తున్న విప్లవాత్మక చిత్రంగా 'గేమ్‌ఛేంజర్'ని చెప్పొచ్చు. ఇందులో రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కైరా అద్వానీ, అంజలీ కథానాయికలు. ఇంకా శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## మహిషాసురుడి కథ

# కరావళి

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'కరావళి'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో గురుదత్త గనిన తెరకెక్కించారు. త్వరలో విడుదలకానుంది. సోమవారం ఫస్ట్‌లుక్ ప్రోమోను విడుదల చేశారు. ఓ వైపు గేదె ప్రసవం, మరోవైపు హీరో జననం..ఈ రెండింటికి ఏదో సంబంధం ఉన్నట్లు చూపించడం..చివరకు హీరో మహిషాసురుడిగా మారినట్లు చూపించడం ఉత్కంఠను పంచింది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కరావళి అనే గ్రామంలో జరిగే కథ ఇది. మన భాష, సంస్కృతి మూలాల్లోంచి కథను తీసుకున్నాం. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభిమన్యు సదానందన్, సంగీతం: సచిన్ బస్రూర్.



# పద్దెనిమిదేళ్ల విరామం తర్వాత

త్రిష అందంగా ఉంటుంది. తెరపై ఆమె యాటిట్యూడ్ మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా ఉంటుంది. ఆ నవ్వు విప్పారిన పొద్దుతిరుగుడుపువ్వులా ఉంటుంది. మొన్నామధ్య వచ్చిన మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్'లో చాలామంది హీరోయిన్లున్నా, అందంలో అందరికంటే ఒకమార్కు ఎక్కువ త్రిషకే పడిందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అందుకే.. నేటికీ పెద్దపెద్ద సినిమాలు ఈ అందాన్నే వరిస్తున్నాయి. ఇటీవలే తమిళ విజయ్‌కి జోడీగా ఆమె నటించిన 'లియో' సినిమా విడుదలై మంచి వసూళ్లే రాబట్టింది. త్వరలో మరో భారీ సినిమాలో నటించనుంది త్రిష. అది కూడా తెలుగు సినిమా. అందునా మెగాస్టార్ సినిమా. అవును.. చిరంజీవి హీరోగా మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'లో త్రిష ప్రధాన కథానాయికగా ఎంపికైంది. అనుష్క, నయనతార, ఐశ్వర్యరాయ్ ఇలా చాలామంది హీరోయిన్ల పేర్లు ఈ పాత్ర విషయంలో వినిపించాయి. చివరకు త్రిష ఖరారైంది. 18ఏళ్ల క్రితం చిరంజీవితో 'స్టాలిన్' సినిమాలో నటించింది త్రిష. మళ్లీ ఇన్నాళ్లకు మెగాస్టార్‌తో జతకట్టనుంది. మెగా అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే.



# బాలీవుడ్‌లో సత్తా చూపిస్తా

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ ఏ పాత్రలోనైనా చక్కగా ఒదిగిపోతుంది. వాణిజ్య చిత్రాలతో పాటు మహిళా ప్రధాన కథాంశాల్లో కూడా తనదైన నటనతో మెప్పిస్తుంది. ఈ ఏడాది విడుదలైన 'దసరా' చిత్రంలో వెన్నెలగా అద్భుతాభినయంతో మెప్పించింది. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూ నటిస్తున్న వెబ్ సిరీస్ 'అక్క'. పీరియాడిక్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కనున్న ఈ సిరీస్‌ను బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్‌లో రాధికా ఆప్టేతో కలిసి నటించనుంది కీర్తి సురేష్. త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం ఈ సిరీస్ తాలూకు రిహార్సల్స్ ముంబయిలో జరుగుతున్నాయి. సోమవారం ముంబయిలో అడుగుపెట్టిన కీర్తి సురేష్ తన తొలి బాలీవుడ్ వెబ్ సిరీస్ గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. బాలీవుడ్‌లో తన ప్రయాణం ఈ సిరీస్‌తో మొదలుకావడం ఆనందంగా ఉందని, తాను పోషించిన పాత్ర కూడా పూర్తి కొత్తదనంతో ఉంటుందని కీర్తి సురేష్ పేర్కొంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. కీర్తి సురేష్ ప్రస్తుతం తమిళంలో సైరన్, రఘుతాథ, రివాల్వర్ రాణి, కన్నివేడి వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

## వైమానిక వీరుని కథ

వైమానిక వీరుల పరాక్రమాలను, విధి నిర్వహణలో వారు ఎదుర్కొన్న సవాళ్లను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలైంటైన్'. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్రానికి శక్తిప్రతాప్ సింగ్ దర్శకుడు. మానుషి చిల్లార్ కథానాయిక. సందీప్ ముద్దా నిర్మాత. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న విడుదల చేయబోతున్నారు. త్వరలో టీజర్ రిలీజ్ కానుంది. దర్శకుడు మాట్లాడుతూ ' ఈ సినిమాలో వరుణ్‌తేజ్ ఎయిర్ పైలట్‌గా కనిపిస్తాడు. రాడార్ ఆఫీసర్ పాత్రలో కథానాయిక మానుషి చిల్లార్ నటిస్తున్నది. ఎయిర్‌ఫోర్స్ నేపథ్యంలో వస్తున్న తొలి తెలుగు చిత్రమిది. దేశం ఎదుర్కొన్న అతిపెద్ద వైమానిక దాడుల నేపథ్యంలో యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కించాం. దేశభక్తి ప్రధానంగా ఆకట్టుకుంటుంది. 'మేజర్' వంటి విజయం తర్వాత సోనీ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉంది' అని చిత్రబృందం పేర్కొంది.

